

హైనా దాడిలో 18 గొర్రెలు మృతి

హైనా దాడిలో 18 గొర్రెలు మృతి చెందాయి. ఈ ఘటన కొమురవెల్లి మండలంలో చోటు చేసుకుంది.

వివరాలు 8లో ▸



రైతులను ఆదుకోవాలి

అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు భైరారెడ్డి డిమాండ్ చేశారు.

వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : శుక్రవారం (సాయంత్రం) 06:33

సహర్ : శనివారం (ఉదయం) 04:56

న్యూస్‌రీల్

జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాల్సిందే



హాస్టల్స్ వెల్ఫేర్ ఆఫీసర్స్ నూతన ప్రతినిధులను అభినందిస్తున్న టీఎన్జీఓ నాయకులు

సిద్దిపేటజోన్: జిల్లాను చార్మినార్ జోన్ పరిధిలో కలపాలని టీఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక టీఎన్జీఓ భవన్‌లో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. జిల్లా నూతన కమిటీని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు రాష్ట్ర కమిటీకి వివరించామన్నారు. జిల్లాను చార్మినార్ జోన్ పరిధిలో కలపాలన్నారు. కాస్మొటిక్ ఛార్జీల విషయమై మంత్రి పొన్నం ప్రభాకర్‌తో చర్చిద్దామని చెప్పారు. అనంతరం జిల్లా హాస్టల్స్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సత్యనారాయణ, కార్యదర్శిగా రాజు, అసోసియేట్ అధ్యక్షుడిగా గణేశ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీఎన్జీఓ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రమ్, నాయకులు పాల్గొన్నారు.

అక్షరాలు లక్షల విలువ చేస్తాయి



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ భిక్షపతి

హుస్నాబాద్: ఆలోచనాత్మకమైన అక్షరాల అనుభూతులు లక్షల విలువ చేస్తాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయగిరి భిక్షపతి అన్నారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా గురువారం కళాశాలలో విద్యార్థులకు కవితలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ జీవితంలో పనితో పాటు పాట కూడా ముఖ్యమన్నారు. కవితా రూపమైన పాట మనస్సును రంజింపచేస్తుందన్నారు. కవిత్వం హృదయాలను శుద్ధి చేస్తుందన్నారు. కవిత్వం రాసేవారికి పరిశీలన దృష్టి ఉండాలన్నారు. తాము రాయాలనుకునే విషయాన్ని పోలికలతో, ఊహలతో, వాస్తవాలతో సహృదయతను జోడించి రాయాలని సూచించారు కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, తెలుగు సహాయచార్యులు వెంకటేశ్వర్లు, ఆంగ్ల అధ్యాపకురాలు డాక్టర్ బి.రేణుక, అధ్యాపకులు ఉన్నారు.

సజావుగా ఆంగ్లం పరీక్ష

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): టెన్త్ పరీక్షల్లో భాగంగా గురువారం ఆంగ్లం పరీక్షను జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు ప్రశాంతంగా రాశారు. 13,975 మందికి 13,963 మంది విద్యార్థులు హాజరయ్యారు. 99.91 హాజరుశాతం నమోదు అయ్యింది. పదో తరగతి పరీక్షల జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి వర్గల్, గౌరారం, ములుగు, నెంటూరు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పోతిరెడ్డిపేట, దుద్దెడ, వర్గల్‌లో పర్యవేక్షించారు. అదేవిధంగా జిల్లా పరీక్షల సహాయ అధికారి లక్ష్మయ్య సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఏడు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

సామరస్యంగా కేసులు పరిష్కరించుకోండి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి శివరంజని

బెజ్జంకి(సిద్దిపేట): అన్ని వ్యవస్థలకన్నా న్యాయ వ్యవస్థ చాలా గొప్పదని హుస్నాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి శివరంజని అన్నారు. మండలంలోని దాచారంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి మాట్లాడుతూ ఫిర్యాదులు వచ్చినపుడు అధికారులైనా, ప్రజాప్రతినిధులైనా, ప్రజలైనా న్యాయ వ్యవస్థకు తల వంచాల్సివస్తుందన్నారు. లోక్‌దాలత్‌లో సివిల్ కేసులు పరిష్కారమవుతాయని, వీలైనంత వరకు సామరస్యంగా తగాదాలు పరిష్కరించుకోవాలన్నారు. పిల్లల నడవడిక పైన తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా మెలగాలన్నారు. వారికి తగు జాగ్రత్తలు, సలహాలు ఇచ్చినపుడే వారి లక్ష్యాలను చేరుకుంటారని తెలిపారు. మహిళలకు ఇబ్బందికర పరిస్థితులుంటే షీటీంలను ఆశ్రయించాలన్నారు. ఇప్పుడు కొత్తగా జీరో ఎఫ్ఐఆర్ వచ్చిందని తెలిపారు. డ్రగ్స్, వరకట్న కేసులు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్‌ను అరికట్టేందుకు అందరి సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో కనగండ్ల కవిత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, ప్రధాన కార్యదర్శి జుంలాల్ నాయక్, ఏజీపీ రామకృష్ణ, న్యాయవాదులు శ్రీదేవి, బాబాయిమాత, కృష్ణమూర్తి, మల్లేశం, జనార్దన్‌రెడ్డి, అశోక్, సంపత్, శ్రీనివాస్, ప్రవీణ్, దా చారం ఎంపీటీసీ కొలిపాక రాజు, తదితరులు పాల్గొన్నారు.

కాలువపై అడ్డుకట్ట..
సాగునీటికి కటకట

కొండపాక మండలానికి సాగు నీరు రాకుండా కాలువపై అడ్డుకట్ట వేదయంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. పంటలు చేతికందే వేళ నీరు అందక పొలాలు ఎండుతుండటంతో విలవిల్లాడుతున్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ డీ2, డీ3 కాలువలకు నిరంతరం నీటి సరఫరా చేస్తూ మండలానికి వచ్చే డీ4 కాలువ పూడ్చివేయడం రాజకీయ కుట్రేనని రైతులు మండిపడుతున్నారు. ఇంత జరుగుతున్నా పాలకులు పట్టించుకోకపోవడం శోచనీయం.

– కొండపాక(గజ్వేల్)



తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక ప్రాంతానికి నీరు వెళ్లకుండా తిమ్మారెడ్డిపల్లి శివారులో కాలువపై అడ్డుగా పోసిన మట్టి

ఎండుతున్న పంటలు

- ఆందోళనలో అన్నదాతలు
- కొండపాకపై నేతల వివక్షే అంటూ మండిపాటు
- పట్టించుకోని అధికారులు


కొండపాక మండలం సాగు నీటి విషయంలో మొదటి నుంచి వివక్షకు గురవుతూనే ఉంది. పదేళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 0.5 టీఎంసీల సామర్థ్యంతో వరంగల్ జిల్లాలో తపాస్‌పల్లి రాజర్వాయర్‌ను నిర్మించారు. కొండపాకకు సుమారు 3 కిలోమీటర్ల దూరంలో రిజర్వాయర్ నిర్మించినప్పటికీ మండలానికి సాగు నీరు వెళ్లేందుకు కాలువల నిర్మాణాలు చేపట్టకపోవడాన్ని అప్పట్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పాలకులు స్పందించలేదు.

కాలువల నిర్మాణంతో..

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడటం.. గజ్వేల్ నియోజక వర్గం నుంచి కేసీఆర్ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో పాటు సీఎంగా పదవిని చేపట్టారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి సాగు నీరు అందేలా చూడాలని స్థానిక నాయకులు కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి డీ4 కాలువ ద్వారా గ్రావిటీ ప్రకారం కొండపాక మండలానికి సాగు నీరు అందించేందుకు 2016లో రూ.42 కోట్లను మంజూరు చేశారు. దీంతో తిమ్మారెడ్డిపల్లి శివారులో కాలువల తవ్వకం పనులకు అప్పటి మంత్రి హరీశ్‌రావు భూమి పూజ చేశారు. తిమ్మారెడ్డిపల్లి, కొండపాక, దమ్మక్కపల్లి, గిరాయిపల్లి, సిర్సనగండ్ల, మర్పడ్గ, ఖమ్మంపల్లి, రాంపల్లి, దుద్దెడ, జప్తినాచారం తదితర గ్రామాలతో పాటు మరిన్ని గ్రామాల చెరువుల్లోకి నీరు వెళ్లేలా కాలువలను నిర్మించారు. వరుసగా ఐదేళ్ల పాటు రిజర్వాయర్ నీటితో చెరువులను నింపుతూ వచ్చారు. దీంతో ఎండాకాలంలో సైతం చెరువులు అలుగులు పారడంతో శాశ్వతంగా సాగు నీటి కష్టాలు తీరాయంటూ అన్నదాతలు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

చేర్యాల నాయకుల పనే..

సాగు నీటి గోస తప్పిందనుకున్న అన్నదాతలకు మళ్లీ మునుపటి నీటి తిప్పలు ఏర్పడ్డాయి. తపాస్‌పల్లి రిజర్వాయర్ డీ4 కాలువ ద్వారా కొండపాక మండలానికి సాగు నీరు అందిస్తున్నారు. అయితే తిమ్మారెడ్డిపల్లి శివారులో ఉన్న కాలువలో చేర్యాల తదితర పట్టణాల నాయకులు మట్టిని అడ్డుగా పోసి నీరు రాకుండా చేశారు. దీనికి తోడు రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేయగానే చేర్యాల, కొమురవెల్లి తదితర ప్రాంతాలకు వెళ్లేలా డీ2, డీ3 గేట్లను పూర్తిగా తొలగించి నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో కొండపాక మండలానికి సాగు నీరు రాకుండా పోయింది. ఇదంతా అక్కడి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకుల అండదండలతోనే జరిగిందంటూ ప్రచారం సాగుతోంది.



కొమురవెల్లి మండలంలో తపాస్‌పల్లి రిజర్వాయర్

ఆందోళన వద్దు..

ఈవిషయమై తపాస్‌పల్లి రిజర్వాయర్ డీఈఈ అంజయ్యను వివరణ కోరగా కాలువలో మట్టిని అడ్డుగా పోసిన విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే చర్యలు చేపట్టి మునుపటి మాదిరిగా చెరువులకు నీరు చేరేలా చూస్తామని, రైతులు ఆందోళనకు గురికావద్దని కోరారు.



ఖమ్మంపల్లి శివారులో ఎండిపోయిన వరి పంట

పంటలు చేతికందే వేళ..

వరి పంట పొట్ట దశకు చేరుకున్న వేళ నీటి తడులు ఎక్కువగా అవసరమవుతాయి. లేదంటే గింజలు పాలు పట్టక తాలుగా మారే అవకాశాలున్నాయంటూ రైతులు అంటున్నారు. వర్షాభావ పరిస్థితులకు చెరువుల్లో నీటి నిల్వలు కనిష్ట స్థాయికి చేరడమేకాక, బోరుబావుల్లో నీటి ఊటలు విపరీతంగా తగ్గిపోయాయి. దీంతో వరి పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు రిజర్వాయర్ నుంచి చెరువులకు నీరు రాకుండా కాలువల్లో మట్టిని అడ్డుగా పోయడంతో పంటలు చేతికందే పరిస్థితి కనిపించడంలేదని అన్నదాతలు తీవ్ర ఆందోళనలు చెందుతున్నారు. పార్టీల కతీతంగా నాయకులు, అధికారులు స్పందించి రిజర్వాయర్ నుంచి చెరువులకు నీరు చేరేలా చూడాలని అన్నదాతలు కోరుతున్నారు.



స్వామివార్లకు లక్ష పుష్పార్చన

బ్రహ్మాండనాయకుడికి లక్ష పుష్పార్చన

జిల్లా కేంద్రంలోని భూనీలసమేత లక్ష్మీవేంకటేశ్వర ఆలయ వార్షికోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం సుదర్శన లక్ష్మీ నారసింహ హోమం, మహాపూర్ణాహుతి, కలశ సంప్రోక్షణ, ఆశీర్వచనం, లక్ష పుష్పార్చన చేశారు. అన్నపూజ చేసి భక్తులకు అన్నప్రసాదం వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

లాయర్లుగా, జడ్జీలుగా అవ్వండి



లా కళాశాల విద్యార్థులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురాం

- ప్రజలకు సేవ చేయండి
- న్యాయవాది వృత్తికి సమాజంలో ప్రత్యేక గౌరవం
- లా విద్యార్థులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురాం

సిద్దిపేటకమాన్: న్యాయవాద వృత్తికి సమాజంలో మంచి గౌరవం ఉందని, లాయర్లుగా, జడ్జీలుగా కావాలని లా విద్యార్థులకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ రఘురాం సూచించారు. సిద్దిపేట కోర్టులో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లా కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థులతో గురువారం న్యాయమూర్తి రఘురాం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో లాయర్లుగా, జడ్జీలు గా రాణించి ప్రజలకు సేవ చేయాలని సూచించారు. లా కోర్స్ పూర్తి చేసిన వారికి వివిధ రంగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. లా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు న్యాయమూర్తి సమాధానం చెప్పారు. కార్పొరేట్ వ్యవస్థలో కూడా న్యాయవాదులకు మంచి అవకాశాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు మురళిమోహన్, మిలింద్‌కాంబ్లే, శ్రావణి, వినాయక లా కళాశాల ప్రిన్సిపల్ రవింద్ర ప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, సూపరింటెండెంట్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిఘా ముమ్మరం చేయాలి

- బృందాలు బాధ్యతగా వ్యవహరించాలి
- కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి

సిద్దిపేటరూరల్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నిఘా బృందాలు వారికి కేటాయించిన విధులు బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్, ఎన్నికల అధికారి ఎం.మనుచౌదరి ఆధ్వర్యంలో ఎన్నికల అధికారులకు, నిఘా బృందాలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, నిఘా బృందాలు పకడ్బందీగా విధులను నిర్వహించాలన్నారు. ప్రభుత్వ, పబ్లిక్, ప్రైవేటు స్థలాలలో ఏర్పాటుచేసిన అన్ని రకాల ప్రచార హోర్డింగులు ఫ్లెక్సీలు, పోస్టర్లు వాల్ పేపర్లను పూర్తిస్థాయిలో తొలగించాలన్నారు. రూ.50వేల కంటే ఎక్కువ వెంట తీసుకువెళ్తే వారు సరైన పత్రాలు చూపని పక్షంలో వాటిని సీజ్ చేయాలన్నారు. సీ-విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులు 100 నిమిషాల్లో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతులకు మించి లిక్కర్ సరఫరా కాకుండా ఎక్సైజ్ శాఖ తో పాటు నిఘా బృందాలు చర్యలు చేపట్టాలన్నారు. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే సంబంధిత ఏఆర్‌ఓకు, జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం అందించాలన్నారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను వ్యయ పర్యవేక్షణ బృందం లెక్కించాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి

8 చెక్ పోస్టుల ఏర్పాటు

పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు నియోజకవర్గాల పరిధిలో 8 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. అన్ని నిఘా బృందాల పనితీరును కంట్రోల్ రూమ్ నుంచి పరిశీలిస్తామన్నారు. ప్రొసీజర్ ప్రకారం ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని, ఎన్నికల సభలకు సమావేశాలకు ఉదయం 6 గంటల నుండి రాత్రి పది గంటల వరకు మాత్రమే అనుమతి ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్, దుబ్బాక ఏఆర్వో గరిమా అగర్వాల్, అదనపు డీసీపీ మల్లారెడ్డి, డీఆర్‌ఓ నాగరాజమ్మ, సిద్దిపేట, హుస్నాబాద్ ఏఆర్వోలు సదానందం, రామ్మూర్తి, ఏసీపీలు మధు, సతీష్, పురుషోత్తంరెడ్డి, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

నట్టడవిలో ఏం జరుగుతోంది?

- భయం గుప్పిట్లో రేకులకుంట మల్లన్న ఆలయం
- కొన్నేళ్లుగా ఒగ్గు పూజారుల మధ్య వివాదం
- మళ్లీ భగ్గుమన్న విభేదాలు
- రాళ్లు, కర్రల దాడులతో రాత్రంతా ఉద్రిక్తతే
- 20 మందికి పైగా తీవ్రగాయాలు
- ఆలయానికి వచ్చేందుకు జంకుతున్న భక్తులు

దుబ్బాకటౌన్: మల్లన్న సాక్షిగా నట్టడివిలో ఏం జరుగుతోంది? రేకులకుంట మల్లన్న ఆలయం రణరంగంగా మారడానికి కారణాలేమిటీ? ఒగ్గు పూజారుల మధ్య అసలు వివాదం ఎందుకు కొనసాగుతోంది? ప్రస్తుతం భక్తులు ఇక్కడకు వచ్చేందుకు ఎందుకు జంకుతున్నారు? వంటి విషయాలపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

ప్రసిద్ధి చెందిన రేకులకుంట మల్లికార్జునస్వామి ఆలయం వద్ద బుధవారం రాత్రి ఒగ్గుపూజారుల మధ్య జరిగిన ఘర్షణ రణరంగాన్ని తలపించింది. మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాలనుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి తమ మొక్కులు తీర్చుకునే భక్తులు ప్రస్తుతం ఇక్కడకు రావాలంటేనే జంకుతున్నారు. చుట్టూర పెద్ద కొండలు, దట్టమైన అడవి మధ్యలో కొలువైన స్వామివారిని దర్శించుకునేందుకు ప్రతి ఆది, మంగళ, బుధవారాల్లో వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఒగ్గు పూజారుల మధ్య వివాదం తారాస్థాయికి చేరుకుంది. ఈ క్రమంలోనే ఇరు వర్గాలు రాళ్లు, కర్రలతో దాడులకు పాల్పడ్డారు. ఈ ఘర్షణలో 20 మందికి పైగా పూజారులకు తీవ్రగాయాలయ్యాయి. చిమ్మచీకట్లో వందలాది మంది భక్తులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగులు తీశారు. ఈ క్రమంలో చాలా మందికి గాయాలకు గురయ్యారు.

రాత్రంతా భయం.. భయంగా..

ఒగ్గు పూజారుల మధ్య జరిగిన ఘర్షణతో ఆలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. భక్తులు రాత్రంతా భయంభయంగా గడిపారు. స్వామి వారి వద్దకు వచ్చిన భక్తులు చాలా మంది తామెన్నడూ ఇలాంటి సంఘటన చూడలేదని అన్నారు. పూజాలు, పట్నాలు వేసే ఒగ్గు పూజారులే ఇలా రాళ్లు,కర్రలతో కొట్టుకోవడం దారుణమంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంకా ఉద్రిక్తతనే ..

ఆలయం వద్ద గురువారం రోజంతా ఉద్రిక్తంగానే కనిపించింది.రాత్రి జరిగిన సంఘటనతో ఇరువర్గాలకు చెందిన 20 మందికి పైగా ఒగ్గు పూజారులు తీవ్ర గాయాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఆలయానికి భక్తులు ఎవరూ రాకపోవడంతో ఆలయ పరిసరాలు నిర్మానుష్యంగా కనిపించాయి.



ఆలయం వద్ద నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితి

దశబ్దాలుగా నలుగుతున్న వివాదం..

గొల్లకుర్మల ఆరాధ్యదైవమైన రేకులకుంట మల్లన్న ఆలయం వద్ద తరతరాలుగా ఒగ్గుపూజారులే పూజాకార్యక్రమాలు నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. దుబ్బాకకు చెందిన కోటి వంశం, మల్లాయపల్లికి చెందిన చెరుకూరి వంశం, కమ్మరపల్లికి చెందిన పయ్యావుల వంశం వారు పూజలు, పట్నాలు వేయడం చేస్తున్నారు. వేల సంఖ్యలో భక్తులు రావడంతో లక్షల రూపాయల ఆదాయం వస్తోంది. సుమారు 40 ఏళ్ల క్రితమే రేకులకుంట మల్లన్న ఆలయం దేవదాయ ధర్మాదాయ శాఖ పరధిలోకి వెళ్లింది. ఈఓతో సహా 15 మంది వరకు సిబ్బంది ఉన్నారు. ఒగ్గు పూజారులుగా చెరుకూరి వంశం వారు 26 మంది, కోటి వంశం వారు 22 మంది, పయ్యావుల వంశానికి చెందిన 10 మంది పూజలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవలే పయ్యావుల వంశం వారు మరో 10 మంది ఎండోమెంట్‌నుంచి అనుమతి తీసుకొని పూజలు చేస్తున్నారు. దీంతో చెరుకూరి, కోటి వారు కోర్టును ఆశ్రయించారు. కోర్టు పరధిలో నడుస్తున్న వ్యవహారం పది రోజులుగా నివురుగప్పిన నిప్పులా రగులుతూ వచ్చి తాజాగా బుధవారం రాత్రి తీవ్ర ఘర్షణకు దారి తీసింది. ఏదేమైన ఆలయం వద్ద జరిగిన ఈ సంఘటన తో మల్లాయపల్లి, కమ్మరపల్లి, రాజక్కపేట గ్రామాల్లోనూ ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది.



నిర్మానుష్యంగా మారిన రేకులకుంట మల్లికార్జునస్వామి ఆలయం

ఇరు వర్గాలపై కేసు

ఇరువర్గాల ఒగ్గు పూజారులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. పూజల విషయమై జరిగిన దాడుల్లో సుమారు 20 మంది గాయపడ్డారన్నారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామని, దర్యాప్తు చేసి ఇరు వర్గాలను కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ తెలిపారు.

కమిషనర్‌కు నివేదిస్తా



ఆలయం వద్ద ఒగ్గు పూజారుల మధ్య జరిగిన ఘటనను దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్‌కు నివేదిస్తాం. ఒగ్గు పూజారులు దాడులకు పాల్పడడంతో భక్తులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. తమ సిబ్బంది సైతం విధులు నిర్వహించాలంటే భయందోళన చెందుతున్నారు. ఇరు వర్గాలను సమన్వయం చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. భక్తులు ఆందోళన చెందవద్దు. అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటాం.

–మోహన్‌రెడ్డి, ఆలయం ఈవో

క్లుప్తంగా

కాల్వల నిర్మాణానికి సర్వే

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి ప్రాజెక్టు కింద డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణం కోసం సర్వే నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం రెవెన్యూ శాఖ సర్వేయర్ లక్ష్మీనారాయణ జనగామ గ్రామంలో కెనాల్ నిర్మాణానికి సర్వే చేపట్టారు. ఇటీవల కలెక్టర్ మను చౌదరి గౌరవెల్లి ప్రాజెక్టును పరిశీలించి డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్ కోసం భూ సేకరణ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రెండ్రోజులుగా ప్రాజెక్టు డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్ కోసం రెవెన్యూ అధికారులు శరవేగంగా సర్వేను చేస్తున్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు నుంచి నీటి పంపిణీ కోసం ప్రధాన కెనాల్ నుంచి ఆయా గ్రామాలకు అందించేందుకు వీలుగా డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్ నిర్మించాల్సి ఉంది. ప్రధాన కాల్వ, ఆయా గ్రామాలకు వెళ్లే కాల్వలు మొత్తం 278 ఎకరాల వరకు భూ సేకరణ చేపట్టాల్సి ఉందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

ప్రేమించి మోసం చేశాడు

- ప్రియుడి ఇంటి ఎదుట బాధితురాలి ధర్నా



ప్రియుడి ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న బాధితురాలు, కుటుంబ సభ్యులు

సిద్దిపేటజోన్: ప్రేమించి మోసం చేసిన ప్రియుడి ఇంటి ఎదుట బిడ్డతో బాధితురాలు ధర్నా చేపట్టిన ఘటన సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని 15 వార్డు(ఇమాంబాద్)లో గురువారం చోటు చేసుకుంది. బాధితురాలు స్వాతి, ఆమె కుటుంబీకులు, మహిళ సంఘం ప్రతినిధులతో కలిసి ప్రియుడు ఇంటి ఎదుట ధర్నా చేశారు. బాధితురాలి కథనం ప్రకారం.. అంబిగల్ల స్వాతి అదే గ్రామానికి చెందిన గౌడుగు గణేశ్‌తో ప్రేమలో పడింది. మూడేళ్లుగా ప్రేమించుకున్నారు. ఈ క్రమంలో స్వాతి ఒక ఆడపిల్లకు జన్మనిచ్చింది. పెళ్లి చేసుకోవాలని బాధితురాలు గణేశ్‌ను నిలదీయడంతో తనకు సంబంధం లేదని, పెళ్లికి విముఖత చూపడంతో స్వాతి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఒక దశలో పుట్టిన ఆడపిల్లకు సంబంధించిన డీఎన్‌ఏ టెస్ట్ ఫలితాల్లో గణేశ్ తండ్రిగా తేలింది. అయినప్పటికీ గణేశ్ వివాహం చేసుకోకుండా ఇబ్బంది పెట్టడంతో తనకు, బిడ్డకు న్యాయం చేయాలని ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న వన్ టౌన్ పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితి చేజారకుండా బందోబస్తు నిర్వహించారు. ఒక దశలో బాధితురాలికి నచ్చజెప్పడంతో ధర్నా విరమించింది.

న్యూట్రిషన్ క్లబ్ వేధింపులపై ఆందోళన

- పోలీసులకు బాధితుల ఫిర్యాదు

సిద్దిపేటజోన్: బరువు తక్కువ చేస్తామని నమ్మించి, సభ్యులుగా చేరిన తర్వాత చైన్ సిస్టమ్ పేరిట డబ్బుల కోసం వేధించారని ఆరోపిస్తూ గురువారం పలువురు జిల్లా కేంద్రంలో ఓ హెర్బల్ న్యూట్రిషన్ క్లబ్ వద్ద ఆందోళన చేపట్టారు. బాధితుల కథనం ప్రకారం.. సిద్దిపేట పట్టణానికి చెందిన స్వప్న, రాజిరెడ్డి దంపతులు. గతేడాది స్థానిక రైతు బజార్ వద్ద ఉన్న ఓ న్యూట్రిషన్ సెంటర్ నిర్వాహకులు స్వప్నను కలిసి బరువును తగ్గించే న్యూట్రిషన్ల గురించి వివరించారు. ఇందులో చేరితే లావు తగ్గడంతో పాటు, ఇతరులను చేర్పితే అదనంగా మార్కులు వస్తాయని, కోచ్ ఉద్యోగం వస్తుందని నమ్మబలికారు. బాధితురాలు స్వప్న అందులో చేరి సుమారు.4 లక్షల కొనుగోలు చేసింది. నెల కిందట నిర్వాహకులు కోచ్ ఉద్యోగానికి సంబంధించి కొన్ని పాయింట్లు తక్కువగా ఉన్నాయని, మరో లక్ష కొనుగోలు చేయాలని సూచించారు. నమ్మిన స్వప్న కొనుగోలు చేసినా హోదా రాలేదు. మళ్లీ నిర్వాహకులు ఆమెను మోటివేట్ చేయడంతో డబ్బులు లేక, నిర్వాహకుల ఒత్తిడి భరించక నిద్ర మాత్రలు మింగి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఇంట్లో స్వప్న సూసైడ్ నోట్‌ను గుర్తించిన భర్త రాజిరెడ్డి కుటుంబ సభ్యులతో న్యూట్రిషన్ సెంటర్ వద్ద ఆందోళన చేశాడు. విషయం తెలుసుకున్న వన్ టౌన్ పోలీసులు అక్కడికి చేరుకొని బాధితులకు నచ్చజెప్పారు.

పరిశ్రమలొచ్చె.. ఉపాధి తెచ్చె

- మెడికల్ డివైజెస్ పార్కులో భారీగా పరిశ్రమలు
- ఉపాధి పొందుతున్న యువత, ప్రజలు
- గ్రామాలకు పెరుగుతున్న ఇతర రాష్ట్రాలవారు
- అద్దెకు ఇళ్లు కూడా దొరకని పరిస్థితి
- అభివృద్ధి చెందుతున్న చుట్టు పక్కల గ్రామాలు



మహిళలకు కుట్టుమిషన్లను అందిస్తున్న ఓ పరిశ్రమ యాజమాన్యం (ఫైల్)



సుల్తాన్‌పూర్‌లోని మెడికల్ డివైజెస్ పార్కు ప్రధాన ద్వారం

జిన్నారం(పటాన్‌చెరు): పటాన్‌చెరు నియోజకవర్గంలోని సుల్తాన్‌పూర్‌లో ఉపాధి ఉరకలేస్తోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన మెడికల్ డివైజెస్ పార్కులో 30 వరకు వివిధ రకాల పరిశ్రమలను నెలకొల్పారు. దీంతో గ్రామీణ ప్రజలు, యువకులకు పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుంది. ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన మెడికల్ డివైజెస్ పార్కులో పని కోసం ఇతర రాష్ట్రాల ప్రజలు, యువత వస్తున్నారు. దీంతో చుట్టు పక్కల అద్దెకు కిరాయి ఇళ్లు కూడా దొరకని పరిస్థితి నెలకొంది.

మెడికల్ డివైజెస్ పార్కులోని పరిశ్రమల్లో విధులు నిర్వహించేందుకు జిన్నారం మండలంలోని మాదారం, జిన్నారం, పెద్దమ్మగూడెం, నల్తూర్, కొర్లకుంట, మంత్రికుంట గ్రామాలకు చెందిన అన్ని వర్గాల ప్రజలు వెళ్తున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 5 వేల మంది వరకు యువత, మహిళలు ఉపాధిని పొందుతున్నారు. గ్రామాల నుంచి గుంపులుగా మహిళలు ఆటోల్లో వస్తున్నారు. ఇతర రాష్ట్రాలైన బీహార్, ఒడిషా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల ప్రజలు కూడా పరిశ్రమల్లో విధులు నిర్వహించేందుకు ముందుకొస్తున్నారు.

మాదారం గ్రామం అభివృద్ధి..

డివైజెస్ పార్కు నుంచి మాదారం, మంత్రికుంట, కొర్లకుంట గ్రామాలు కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఉండటంతోపాటు ఇక్కడ ఇంటి కిరాయిలు తక్కువగా ఉండటం, తాగునీటి ఇబ్బందులు లేకపోవడంతో ఈ గ్రామాల్లో నివాసం ఉండేందుకు ఇతర రాష్ట్రాల ప్రజలు ఉత్సాహాన్ని చూపుతున్నారు. దీంతో మాదారం గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుంది. ఇక్కడి భూముల విలువలు కూడా భారీగా పెరిగాయి. ఎకరం రూ.10 కోట్ల వరకు ఉందంటే అభివృద్ధి ఎలా జరుగుతుందో తెలుసుకోవచ్చు.

మెడికల్ డివైజెస్ పార్కులో ఏర్పాటు చేసిన పరిశ్రమల యాజమాన్యాలు గ్రామీణ ప్రాంతాల్లో సీఎస్ఆర్ ద్వారా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మాదారంలో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్‌ను నేర్పించి తగిన ఉపాధిని అందించేందుకు ఓ పరిశ్రమ ముందు

పరిశ్రమల సహకారం

కొచ్చింది. జూట్ బ్యాగులను తయారు చేసేందుకు శిక్షణ ఇవ్వడానికి మరో పరిశ్రమ ముందుకు వచ్చింది. రైతులకు ఇబ్బందులు లేకుండా ఉండేలా ఓ పరిశ్రమ యాజమాన్యం ఆరు బోర్లను కూడా వేయించింది. యాజమాన్యాలు పరిశ్రమల ఏర్పాటుతోపాటు ఉపాధి కల్పించి, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో గ్రామాల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు లేకుండా చూస్తాం



గ్రామ సమీపంలో పరిశ్రమలు ఉండటం వల్ల మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు ఉపాధి లభిస్తోంది. తమ గ్రామంలో నివాసం ఉంటున్న ప్రతీ ఒక్కరికి ఇబ్బందులు లేకుండా చూస్తాం. పరిశ్రమల సహకారంతో గ్రామాల్లోని అన్ని వర్గాల ప్రజలకు ఉపాధిని కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– సురేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ మాదారం

ఉపాధి దొరికింది



సుల్తాన్‌పూర్‌లోని డివైజెస్ పార్కులో ఓ పరిశ్రమలో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నా. పరిశ్రమలు ఏర్పాటు కావడంతో ఉపాధి లభించింది. మాదారంలో అద్దెకు ఉంటున్నా. ఇక్కడ ప్రతీ ఒక్కరి సహకారం లభిస్తుంది. సంతోషంగా విధులు నిర్వహిస్తున్నా.

– బుద్దాదెబ్ రాయ్, ఉత్తరప్రదేశ్, ఉద్యోగి

మరిన్ని ఏర్పాటు చేయాలి



మా గ్రామ సమీపంలో పరిశ్రమలు ఏర్పాటు కావడంతో ఇక్కడి యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. గతంలో పని కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డా. ప్రస్తుతం డివైజెస్ పార్కులోని ఓ పరిశ్రమలో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నా. మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– తెనుగు శేఖర్, మాదారం

హైనా దాడిలో 18 గొర్రెలు మృతి



మృత్యువాత పడిన గొర్రెలు

మద్దూరు(హుస్నాబాద్): హైనా దాడిలో గొర్రెలు మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్ల కొమురెల్లి రోజు మాదిరిగానే బుధవారం సాయంత్రం వ్యవసాయ బావి వద్ద ఉన్న దొడ్డిలో గొర్రెలను పంపి ఇంటికి వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున దొడ్డి వద్దకు వెళ్లి చూడగా 18 గొర్రెలు మృతి చెందగా, మరో 6 గొర్రెలు తీవ్ర గాయాలతో కనిపించాయి. గ్రామస్తుల ద్వారా సమాచారం అందుకున్న ఫారెస్టు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాస్, ఫారెస్టు ఆఫీసర్ రాయుడు, వెటర్నరీ అధికారులు గ్రామానికి చేరుకొని గొర్రెలపై దాడి చేసింది హైనా అని నిర్ధారించారు. మృతి చెందిన గొర్రెలకు పంచానా నిర్వహించారు. అలాగే, ముందు రోజు రాత్రి గ్రామానికి చెందిన కర్రె నర్సయ్య దూడే హైనా దాడిలో మృతి చెందింది. కాపరులను ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలని గొర్రెల కాపరుల రాష్ట్ర సంక్షేమ సంఘం అధ్యక్షుడు పోచబోయిన శ్రీహరి, ఎంపీటీసీ గుజ్జుల సమ్మయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రైతులను ఆదుకోవాలి



ఇబ్రహీంనగర్‌లో దెబ్బతిన్న మిర్చి పంట పరిశీలిస్తున్న నాయకులు, రైతులు

- రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు భైరారెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు భైరారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని ఇబ్రహీంనగర్‌లో వర్షాలకు దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు, మిర్చి పంటలను పరిశీలించారు. వారికి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాల మూలంగా పంటలకు నష్టం వాటిల్లి తీరని నష్టం జరిగిందన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేలు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి మహేందర్, నాయకులు సంజీవులు, సంపత్, శ్రీనివాస్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

- తలపై, ఒంటిపై తీవ్ర గాయాలు
- టేక్మాల్ మండలం తంప్లూర్ గ్రామంలో ఘటన



మృతదేహాన్ని పరిశీలిస్తున్న క్లూస్‌టీమ్



సంగమ్మ (ఫైల్)

టేక్మాల్(మెదక్): మహిళను దారుణంగా హత్య చేసిన ఘటన టేక్మాల్ మండలంలోని తంప్లూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుబ్బగల్ల సంగమ్మ(44) వ్యవసాయంతోపాటు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంది. ఈమె భర్త కొన్నేళ్ల కిందట మృతి చెందగా, కుమారుడు నాగరాజు హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. ఇంటి వద్ద ఒంటరిగా ఉంటున్న సంగమ్మ రోజుమాదిరి గానే తిని నిద్రించగా ఉదయం 9 కావస్తున్నా తలుపులు తీయలేదు. ఇంటికి రెండు డోర్లు ఉండగా ఒకటి లోపల గడియపెట్టి ఉంది. మరోటి ఇంటికి బయట నుంచి తాళం వేసి ఉంది. చుట్టుపక్కల వారు తాళం పగులగొట్టి చూడగా రక్తపు మడుగులో సంగమ్మ మృతి చెంది కనిపించింది. విషయం తెలుసుకున్న అల్లాదుర్గం సీఐ రేణుక రెడ్డి, టేక్మాల్ ఎస్ఐ మురళీ ఘటనా స్థలానికి చేరుకొని, క్లూస్ టీం, డాగ్స్ స్క్వాడ్ ద్వారా విచారణ చేపట్టారు. గుర్తు తెలియని దుండగులు బలమైన ఆయుధంతో తలపై, చేతులపై దాడి చేసి హత్య చేసినట్లు గుర్తించారు. మృతురాలి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

- డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌తో వివరాలు సేకరణ



కుమార్(ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్) : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని రామేపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై నవత గౌడ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అరిగే కుమార్(42)కుమార్ తల్లి పోచమ్మతో కలిసి గ్రామంలోని ఓ పూరి గుడిసెలో ఉంటూ వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. ఇతడి భార్య భూలక్ష్మి, కుమారుడు, కూతురితో కలిసి సుమారు 10 ఏళ్లుగా జిన్నారం మండలంలోనే ఉంటుంది. అయితే, మంగళవారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో కుమార్ తల్లికి చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. బుధవారం ఉదయమైనా ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. అదే రోజు రాత్రి గ్రామానికి చెందిన గాండ్ల రమేశ్ మూత్ర విసర్జనకు వెళ్లగా ఇంటికి కూతవేటు దూరంలో ఉన్న ఓ పాడుబడిన గుడిసెలో సెల్ ఫోన్ రింగ్ అవుతుంది. గమనించిన రమేశ్ వెళ్లి చూడగా కుమార్ పడిపోయి కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మృతదేహం బోర్లా పడి ఉండడం, మృతుడి ఒంటిపై ప్యాంటు లేకపోవడంతో గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తూ డాగ్ స్క్వాడ్ రప్పించాలంటూ పోలీసులతో పట్టుబట్టారు. దీంతో గురువారం ఉదయం క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ రప్పించగా పోలీస్ జాగిలం గ్రామంలోని బుడగజంగాల కాలనీ వద్దకు వెళ్లి ఆగింది. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని..

- భర్త ఆత్మహత్య

సిద్దిపేటకమాన్: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట వన్ టౌన్ ఎస్ఐ నర్సింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపాక మండలం బందారం గ్రామానికి చెందిన రెడ్డబోయిన నరేశ్ (37)కు సిద్దిపేట పట్టణం కాళ్లకుంట కాలనీకి చెందిన భాగ్యతో కొన్నేళ్ల కిందట వివాహమైంది. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో వేర్వేరుగా ఉంటున్నారు. 18వ తేదీన నరేశ్ భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో కాళ్లకుంట కాలనీలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తల్లి రత్నవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భూములు చూసేందుకు వెళ్తుండగా..

- ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టిన కారు
- ఒకరు మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు



నుజ్జు నుజ్జయిన కారు



కారులో గిరి మృతదేహం

పటాన్‌చెరు టౌన్: ముందు వెళ్తున్న లారీని కారు ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన బీడీఎల్ భానూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బీడీఎల్ సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం.. హైదరాబాద్ వనస్థలిపురానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే గిరి(50), దత్తాత్రేయ, సుధాకర్, శ్యాంసుందర్ గౌడ్ లు కారులో గురువారం సదాశివపేటకు భూములు చూసేందుకు వెళ్తున్నారు. గిరి డ్రైవింగ్ చేస్తుండగా మిగితా ముగ్గురు కూర్చున్నారు. పటాన్‌చెరు మండలం పాటి గ్రామ సమీపంలో ఓఆర్ఆర్ పై ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి బలంగా కారుతో ఢీకొట్టారు. ఈ ఘటనలో కారు నడుపుతున్న గిరి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గిరి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య



ఆంజనేయులు మృతదేహం

రాయపోలు(దుబ్బాక): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన రాయపోలు మండలం అనాజీపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై రఘుపతి, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అనాజీపూర్‌కు చెందిన మంగలి ఆంజనేయులు (55) కొద్ది రోజులుగా మద్యానికి బానిసై రోజూ తాగుతుండేవాడు. ఇటీవల కుటుంబంలో గొడవలు జరిగాయి. ఈ నెల 20 కుటుంబ సభ్యులందరూ బంధువుల పెళ్లి నిమిత్తం పెద్ద మల్లారెడ్డికి వెళ్లి రాత్రి 7 గంటల ప్రాంతంలో ఇంటికి రాగా ఆంజనేయులు కనిపించలేదు. రాత్రంతా వెతికినా దొరకలేదు. గురువారం ఉదయం వారి వ్యవసాయం పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు.

మద్యం మత్తులో స్నానానికి వెళ్లి..

- చెరువులో మునిగి వ్యక్తి మృతి

ములుగు(గజ్వేల్) : చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన ములుగు మండలం మామిడ్యాల ఆర్అండ్ఆర్ కాలనీ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ మధు వివరాల ప్రకారం.. మండలంలోని తున్కిబొల్లారం గ్రామానికి చెందిన పర్వతం స్వామి(35) చిత్తు కాగితాలు ఏరుకొని వాటిని అమ్మగా వచ్చిన డబ్బులతో మద్యం సేవిస్తుంటాడు. రోజు మాదిరిగానే బుధవారం మద్యం తాగి సాయంత్రం 4 గంటలకు ఇంటికొచ్చాడు. గంట తర్వాత బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. మామిడ్యాల ఆర్అండ్ఆర్ కాలనీ సమీపంలో గల సాయి చెరువులోకి స్నానానికి వెళ్లి తాగిన మైకంలో నీట మునిగాడు. చుట్టు పక్కల వాళ్లు గమనించి ఎంత సేపటికీ బయటకు రాకపోవడంతో భార్య కొండవ్వకు చెప్పారు. వెంటనే ఆమె కుటుంబ సభ్యులతో చెరువు వద్దకు వెళ్లి ఆచూకీ కోసం గాలించగా దొరకలేదు. గురువారం ఉదయం మృతదేహం చెరువులో తేలయడంతో బయటకు తీశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

కందిరీగల దాడిలో 20 మంది గాయాలు

హత్నూర (సంగారెడ్డి): కందిరీగల దాడిలో 20 మందికి గాయాలైన ఘటన హత్నూర మండలం బ్రాహ్మణగూడ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామంలోని వడ్డే యాదగిరి ఇంటి వద్ద ఉన్న చింత చెట్టుకు పెద్ద కందిరీగలు ఉండడంతో చూసుకోకుండా కింద మంట పెట్టారు. ఒక్కసారిగా కందిరీగలు లేచాయి. ఒకే కుటుంబానికి చెందిన దివ్యాంగుడైన మల్లేశం, తండ్రి పోచయ్య, తల్లి దుర్గమ్మకు, తాజా మాజీ ఉపసర్పంచ్ జాంగిర్ భాష, చాకలి నర్సమ్మతోపాటు పలువురికి తీవ్ర గాయాలు అయ్యారు.

విష గుళికలు తాగి పాడి గేదెలు మృతి

- రూ.2 లక్షల వరకు నష్టం



గేదెల వద్ద రోదిస్తున్న బాధిత రైతు

అక్కన్నపేట(హుస్నాబాద్): విష గుళికలు తాగి పాడి గేదెలు మృత్యువాత పడిన ఘటన అక్కన్నపేట మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన మట్టెల కనకయ్య అనే రైతు కుటుంబం పాల ఉత్పత్తితో జీవనం సాగిస్తున్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కనే తన కున్న వ్యవసాయ క్షేత్రంలో ఉదయం పాలు పితికి గేదెలను కట్టేశారు. వాటి కోసం పాకలో కుడితి పెట్టి ఊరికి వెళ్లాడు. సాయంత్రం సదరు రైతు తండ్రి పోచయ్య పొలం వద్దకు వెళ్లగా కుడితి తాగిన గేదెలు రక్తం కక్కుకుంటూ కొట్టుకోవడం కనిపించాయి. వెంటనే కుమారుడు కనకయ్యకు ఫోన్ ద్వారా సమాచారాన్ని అందించాడు. అతడు వచ్చేసరికి రెండు గేదెలు మృతి చెందాయి. వీటి విలువ సుమారుగా రూ.2లక్షల వరకు ఉంటుందని, ఈ ఘటనపై బాధిత రైతు కనకయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

- పంట రక్షణకు పెట్టిన కరెంట్ తీగలు తగిలి ఘటన



రాంసింగ్ మృతదేహం

కల్హేర్(నారాయణఖేడ్): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన గురువారం కల్హేర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. పోమ్యానాయక్ తండాకు చెందిన తారవత్ రాంసింగ్(42) తండా సమీపంలోని కస్ప పెంటయ్యకు చెందిన వ్యవసాయ భూమి కౌలుకు తీసుకొని జొన్న పంట వేశాడు. జొన్న పంట కాపలా కోసం ఉదయం ఇంటి వెళ్తున్నాడు. మార్గమధ్యలో శ్రావణ్ అనే మరో రైతు పందుల బెడద నుంచి జొన్న పంట కాపాడేందుకు చుట్టూ కరెంట్ తీగలు పెట్టాడు. అక్కడి నుంచి తారవత్ రాంసింగ్ వెళ్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ తీగలు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. రైతు శ్రావణ్ నిర్లక్ష్యంగా జొన్న పంట చుట్టూ ఎలాంటి హెచ్చరిక లేకుండా కరెంట్ తీగలు పెట్టడంతో షాక్‌తో రాంసింగ్ మృతి చెందాడని కుటుంబీకులు ఆరోపించారు. బంధువులు, కుటుంబీకులు శ్రావణ్‌ను పట్టుకొని దేహ శుద్ధి చేశారు. రాంసింగ్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండు చేశారు. సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, కల్హేర్ ఎస్ఐ వెంకటేశం అక్కడికి చేరుకొని బాధితులకు నచ్చజెప్పారు. మృతుడి భార్య స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆశ చూపి.. బంగారం అపహరించి

- మహిళకు మాయ మాటలు చెప్పిన కి'లేడీ'
- కారు ఇప్పిస్తానంటే నమ్మి యాదగిరిగుట్టకు వెళ్లిన బాధితురాలు
- నిద్ర మత్తులో ఉండగా పుస్తెలతాడు చోరీ



సీసీ ఫుటేజీలో మాధవి దృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఓ మహిళకు ఆశ చూపి మరో మహిళ బంగారం, నగదు అపహరించిన ఘటన పటాన్‌చెరులో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు అంబేడ్కర్ కాలనీకి చెందిన పారిశుద్ధ్య కార్మికురాలైన స్వరూపకు తన యజమాని వద్ద పని ఉందని రోజుకి రూ. 5 వేలు ఇస్తారని మాధవి అనే మహిళ పటాన్‌చెరులో పరిచయం చేసుకుంది. తాను కూడా పటాన్‌చెరులో ఉంటానని నమ్మబలికింది. తనకు తెలిసిన వారి వద్ద కారు ఉందని రూ.30 వేలకే ఇస్తారని డబ్బులు తీసుకురమ్మని చెప్పింది. బుధ వారం మాధవి స్వరూపను తీసుకెళ్లడానికి వచ్చింది. వీరితోపాటు నిర్మల అనే మరో మహిళను కూడా తీసుకొని యాదగిరిగుట్టకు వెళ్లారు. అక్కడే స్వరూప దగ్గర కారు గురించి దాదాపు రూ. 40 వేలు మాధవి తీసుకుంది. అనంతరం ముగ్గురు మద్యం సేవించారు. వీరికి మత్తు రావడంతో నిర్మల, స్వరూప అక్కడే నిద్రపోయారు. నిర్మలకు మెలకువ వచ్చాక మాధవి మాయమాటలు చెప్పి గుట్ట కిందకు పంపించింది. స్వరూపను కూడా తీసుకొస్తానని వెళ్లిన మాధవి ఆమె మెడలోని బంగారు మంగళ సూత్రాలు తీసుకొని వెళ్లింది. నిద్ర లేచిన స్వరూప ఎవరూ అక్కడ లేకపోవడంతో మాధవి మోసిందని గుర్తించి ఇంటికొచ్చేసింది. ఘటనను స్థానికులకు చెప్పడంతో వారి సాయంతో అంబేడ్కర్ కాలనీలోని సీసీ ఫుటేజీలో మాధవిని గుర్తించారు. ఈ విషయంపై పటాన్‌చెరు పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేపట్టారు.